క్లుప్తంగా

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని గోపాలపురంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.88 లక్షలతో చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. రూ.10 లక్షలతో గౌడ కమ్యూనిటీ భవనం, రూ.5 లక్షలతో రజక కమ్యూనిటీ భవనం, రూ.5 లక్షలతో రజకుల ఏరియాల్లో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.65 లక్షలతో జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.3 లక్షలతో అదే పాఠశాలలో నిర్మించనున్న సైకిల్ షెడ్డు పనులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

ఆర్థిక సాయం పంపిణీ



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: గ్రామానికి చెందిన అడబాల రూతు అనే నిరుపేద మహిళకు హెల్పింగ్ ఇన్ నీడ్ అనే సంస్థ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. సోమవారం మలికిపురం లేమాన్స్ ఇవాంజలికల్ చర్చి వద్ద జరిగిన కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా ఈ సాయాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సాయం అందిస్తున్న సంస్థ సేవలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల కాశి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, రొక్కాల వెంకట్ పాల్గొన్నారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికి చెందిన చొప్పల సురేంద్రకు సోమవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. స్వతంత్రంగా పనులు చేసుకోలేని స్థితిలో ఉన్న సురేంద్రకు పై మొత్తాన్ని రాపాక ఫాలోవర్స్, ఎన్నారైలు దొండపాటి చిన్న, చెవ్వాకుల మోహన్, గెడ్డం సురేష్, కొల్లాబత్తుల అజయ్‌లు గల్ఫ్ నుంచి పంపారు. ఈ మేరకు ఎమ్మెల్యే పై మొత్తాన్ని ఆయనకు ఇంటి వద్ద అందజేశారు. నాయకులు గెడ్డం అమ్ములు, కె.అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో తృతీయ స్థానం సాధించిన లక్ష్మి, భార్గవి కోచ్ త్రిమూర్తులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో అంబాజీపేటకు చెందిన ఆర్‌డీఎస్.లక్ష్మి, వీటీ భార్గవిలు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ గత నెల డిసెంబర్‌లో 27 నుంచి 30 వరకు నిర్వహించిన తైక్వాండో అండర్–14లో ఆర్‌డీఎస్ లక్ష్మి 38 కేజీల విభాగంలో తృతీయ స్థానం సాధించారన్నారు. కడప జిల్లా రైల్వే కోడూరులో 26 నుంచి 27 వరకు జరిగిన అండర్–19 తైక్వాండో పోటీల్లో భార్గవి 42 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. క్రీడాకారులను హెచ్‌ఎం బీర హనుమంతరావు, కోచ్‌లు బి.కుసువీర్, కె.వైష్ణవి, పీఎంసీ సభ్యులు కామిశెట్టి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గుల పంపిణీ



రామరాజులంకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎన్నారై రాజశేఖర్

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో సోమవారం పేదలకు రగ్గులు పంపిణీ జరిగింది. కార్డ్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి వీటిని అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మల్లాడి సుమన్ క్రిష్టాఫర్, మంజుల, ఎన్నారై చొప్పల రాజశేఖర్ చేతుల మీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్ పాల్గొని సంస్థ సేవలను అభినందించారు. ఏసుబాబు, పీఏసీఎస్ చైర్మన్ చొప్పల రాజేశ్వరరావు, సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షులు నల్లి బాలకృష్ణ, రాబర్ట్, మేడిచర్ల గంగరాజు, దయానంద్, గొల్ల రమేష్, సురేంద్ర తదతరులు పాల్గొన్నారు.



జొన్నాడలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలంకార భూషితులైన దేవతామూర్తులు



అంబాజీపేటలో వేంకటేశ్వరునికి లక్షచామంతి పూలతో అలంకరించిన పండితులు



అయినవిల్లిలో సీతారామచంద్ర స్వామికి చేసిన లక్ష చామంతి పూజ



ఎల్.గన్నవరంలో ప్రత్యేకాలంకరణలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి

వైభవంగా వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- స్వామికి ప్రత్యేక పూజలు



ఊబలంకలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



కొత్తపేటలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపేట: వైకుంఠ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం విష్ణుమూర్తి, వేంకటేశ్వరస్వామి, సీతారామా సహిత ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనంతో భక్తులు పులకించారు. స్థానిక హరిహర దేవాలయం ప్రాంగణంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యుల ఆధ్వర్యంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచి వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదిరోజులుగా రోజుకో ఒక్కో అవతారం చొప్పున గ్రామోత్సవం పేరుతో ఊరేగించిన విష్ణుమూర్తి దశావతారాలను ఆలయం వద్ద ప్రదర్శించగా భక్తులు దర్శించుకున్నారు. స్థానిక ఏనుగులమహల్ గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ నిర్మాణకర్త సిద్దంశెట్టి గంగారావు ఆధ్వర్యంలో, పలివెల అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ ఫౌండర్ విన్నకోట మారుతీబంగారం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ జరిపారు. స్థానిక శ్రీకోదండరామాలయం, మండలంలోని రామాలయాల్లో భక్తులు ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు.

రావులపాలెం: ముక్కోటి ఏకాదశి పర్వదినం కావడంతో సోమవారం మండలంలోని వివిధ ఆయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయాలతో పాటు వెంకటేశ్వర స్వామి, రామాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. మండలంలోని ఊబలంక కోదండ రామాలయంలో అన్నవరం నుంచి తీసుకువచ్చిన స్వామి ఫొటోలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబాజీపేట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్యర్యంలో వేంకటేశ్వరస్వామికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక పూజల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల్లో తెల్లవారు జామున ఉత్తర ద్వార భక్తులకు ప్రవేశం కల్పించారు. పుల్లేటికుర్రు వెంకటేశ్వర స్వామి ఆలయం, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, నందంపూడి, తొండవరం తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైకుంఠ ముక్కోటి ఏకాదశి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరులో వేంచేసిన ఉత్తర ముఖ ద్వార శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామిని, ఆలమూరు, మడికి, జొన్నాడ గ్రామాల్లోని జనార్దనస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అలంకార భూషితులైన దేవతామూర్తుల విగ్రహాలు భక్తులను అలరించాయి. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగి పుణ్యప్రాప్తి లభిస్తుందనే భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలాగే ముక్కోటి సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అయినవిల్లి: స్థానిక అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో కొలువైన శ్రీ, భూ సమేత కేశవస్వామివారి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ముక్కోటి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించు కుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామికి విశేష క్రతువులు జరిపారు. స్థానిక సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నల్లచెరువు వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ముక్తేశ్వరం, వీరవల్లిపాలెం, నేదునూరు, చింతనలంక గ్రామాల్లో సప్తాహం నిర్వహించారు.

పి.గన్నవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మండలంలో భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలకు వెళ్లి భక్తులు పూజలు చేశారు. దీంతో పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయం, లక్ష్మీకనకదుర్గ, వేంకటేశ్వరస్వామి, పట్టాభిరామాలయం, పంచముఖ ఆంజనేయ స్వామి, ఎల్.గన్నవరం వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



మొసలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అంబాజీపేట: అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. మొసలపల్లి శివారు కట్టావారిపాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా చిన్నారులకు మెనూ అందించాలన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులపై ప్రేమాభిమానాలు చూపిస్తూ వారికి పాఠాలు బోధించాలన్నారు. అంగన్‌వాడీ భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నామని ఈ భవనం కూడా శిథిలమైపోయిందని దీని స్థానే కొత్తది నిర్మించాలని ఎంపీపీ, జెడ్పీటీసీలకు అంగన్‌వాడీ టీచర్ డి.లలితాకుమారి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగాబత్తుల సత్యనారాయణ, కట్టా రామచంద్రరావు, నాగాబత్తుల శ్రీనివాసరావు, కట్టా గోపాలకృష్ణగోఖలే తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



అంతర్వేదికరలో విద్యార్థులకు క్రీడాదుస్తులను ఇస్తున్న నాగేంద్రకుమార్, నరసింహారావు

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యాన పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.50 వేలు విలువైన క్రీడా దుస్తులను, సామగ్రిని వితరణ చేశారు. గ్రామ సర్పంచ్ పోతురాజు నరసింహారావు, పాఠశాల స్థలదాత, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్రకుమార్ వీటిని విద్యార్థులకు అందజేశారు. పూర్వ విద్యార్థులు చిర్ల రామాంజనేయులు, బెల్లంకొండ రాజబాబు, మండపాక సతీష్, బెల్లంకొండ నరసింహారావు, పోతురాజు నాగశ్రీను, రావి విష్ణు, బెల్లంకొండ సత్యనారాయణలు కలిపి వీటిని సమకూర్చారు. ఎంఈవో నల్లి మనోహరం, హెచ్‌ఎం కోలా వీరాస్వామి, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి ఆంజనేయులు పూర్వ విద్యార్థులను అభినందించారు. స్థానికులు దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసు, కొల్లాబత్తుల ధర్మారావు, బెల్లంకొండ శ్రీను పాల్గొన్నారు.

ఆలయ మౌలిక వసతుల కల్పనకు కృషి



స్వామిని దర్శించుకుంటున్న ఎమెల్యే జగ్గిరెడ్డి దంపతులు

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరగడంతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించిందని ఇందుకోసం రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించడానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఉదయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వాడపల్లి వెంకన్న ఆలయంలో సతీసమేతంగా ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఈ ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో భక్తుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆలయంలో అన్నదానానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ ఆలయానికి వెళ్లే రహదారులు, వంతెనలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల సమయంలో వచ్చే భక్తులు, యాత్రికులకు తగిన రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే పార్కింగ్ స్థలాన్ని సైతం అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆలయంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన ద్వారాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను చైర్మన్, ఈవో ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

అగ్నిప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆర్థిక సాయం



పెదపళ్లలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం సంభవించింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. స్థానికుల కథనం ప్రకారం స్థానిక ఎస్సీ పేటలో వలంటీర్ తాతపూడి చినరాజుకు చెందిన ఇంట్లో సోమవారం తెల్లవారుజామున హఠాత్తుగా మంటలు వెలువడి క్షణాల్లో అంతటా వ్యాప్తి చెందాయి. స్థానికులు వచ్చి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల, మేడపాటి లక్ష్మణరావు, దొడ్డారపు సుబ్బారావు, గొడితి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శ

కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగత సాయంగా రూ.15 వేలు, ప్రభుత్వ సాయంగా రూ ఐదు వేలు, క్వింటా బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. అలాగే గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, సర్పంచ్ సత్యశ్రీ సమకూర్చిన రూ.13,800 సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా వారు అందజేశారు. ప్రభుత్వ పరంగా వచ్చే సాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ జి.లక్ష్మీపతి, కార్యదర్శి వి.వేణి పాల్గొన్నారు.

ఏపీ ఎన్ఆర్టీఎస్ చైర్మన్‌ను కలసిన శశికిరణ్



అమరావతిలో వెంకట్‌కు శుభాకాంక్షలు చెబుతున్న శశికిరణ్

సఖినేటిపల్లి: తాడేపల్లిలో సోమవారం ఏపీ ఎన్ఆర్టీఎస్ కార్యాలయంలో చైర్మన్ మేడపాటి వెంకట్‌ను రామేశ్వరానికి చెందిన వైఎస్సార్ సీపీ ఖతార్ కన్వీనర్, ఖతార్ ఎన్ఆర్టీఎస్ కో ఆర్డినేటర్ దొండపాటి శశికిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొకేతో ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను శశికిరణ్ తెలిపారు. అత్యధికంగా విదేశాలకు వలస వెళుతున్న ప్రవాసాంధ్రుల కోసం, కోనసీమ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం ఒక నైపుణ్యాభివృద్ధి సంస్థ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయనను శశికిరణ్ కోరారు.

దాత ఆశయం అభినందనీయం

అంబాజీపేట: మరణానంతరం అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు పడుతున్న ఇబ్బందులను గమనించి ఒక దాత దహన సంస్కారాలు నిర్వహించుకునేందుకు శాశ్వత కట్టడాన్ని నిర్మించడం అభినందనీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి కోటబాబు, ఎంపీటీసీ మట్టా పార్వతి అన్నారు. మాచవరం హిందూ స్మశాన వాటికలో శ్రీరామ్ ఘాట్–దుర్గా క్షేత్రం వద్ద మంచాల సత్యనారాయణ (బుల్లి తమ్ముడు), శ్రీనివాస్ సహకారంతో నూతనంగా నిర్మించిన ఆఖరు మజిలీకి శాశ్వత కట్టడాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కట్టడాన్ని మంచాల పెదకాపు, సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థంగా రూ.25 లక్షలతో నిర్మించినట్లు వారి కుమారులు సత్యనారాయణ, శ్రీనివాస్ తెలిపారు. ఆకలి మజిలీకి శాశ్వత కట్టడాన్ని ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం దాతలిద్దరినీ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుంకర పేరయ్యనాయుడు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, నల్లా మౌళి, సుంకర బాలాజీ, నాగాబత్తుల సుబ్బారావు, అరిగెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మామిడికుదురు: అప్పనపల్లి ఉచ్చులవారిపేటలో కొలువుదీరిన రక్షకుని మాత దేవాలయంలో ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఫాదర్ టి.రాజేష్ తన క్రిస్మస్ సందేశంలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా కారుపల్లి సోని, భవాని అందించిన చీరలను పేదలకు అందజేశారు. క్రైస్తవులు ఆలపించిన ఏసుక్రీస్తు గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రిస్మస్‌లో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ గుర్రం జయకుమార్, సంఘ పెద్దలు బత్తుల జనార్దనరావు, నేరేడుమిల్లి నాగేశ్వరరావు, గెడ్డం వెంకటేశ్వరరావు, విప్పర్తి గణపతి, పాలమూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో న్యూఇయర్ వేడుకలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పీహెచ్‌సీకి సోమవారం విచ్చేసిన వైద్యారోగ్య సిబ్బంది తొలుత వైద్యాధికారులు ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీశంకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్‌ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ, ఫార్మాసిస్టు సుగుణలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లను తొలగించాలని వినతి

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జి.భీమారావుకు సోమవారం సచివాలయ కన్వీనర్లను తొలగించాలని కోరుతూ మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వినతిపత్రం అందజేశారు. వలంటీర్ల వ్యవస్థను తెచ్చి సర్పంచ్‌లను, ఎంపీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చితే, ఇటీవల మరల వలంటీర్లపై అజమాయిషీ చేయడానికి ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించడం దారుణమన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

అయినవిల్లి: మండలంలో తొత్తరమూడిలో రూ.15 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ వార జయసావిత్రి, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చుట్టూరి లక్ష్మణరావు, నేదునూరి సత్యనారాయణ, ప్రసాద్, నాని తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వామివారి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో సోమవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం అర్చకులు ఘనంగా నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఈ గ్రామోత్సవం జరిగింది. భక్తులు స్వామిని దర్శించుకుని, అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా చెల్లించుకున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదాం

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు సహకరించి కాలుష్య నివారణకు సహకరించాలని ఎంపీటీసీ నాగాబత్తుల సత్యనారాయణ, కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి అన్నారు. మొసలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి చంటి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సేకరణకు, కంపోస్టు ఎరువుల తయారీకి ప్రజలు సహకరించి దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సభలో దంతులూరి శ్రీనురాజు, కట్టా రామచంద్రరావు, నాగాబత్తుల శ్రీనివాసరావు, కట్టా దుర్గాదేవి, దంతులూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి తగు సూచనలు చేయాలని జిల్లా వైద్య నోడల్ అధికారి డాక్టర్ డీవీ సత్యం అన్నారు. పసుపల్లి సచివాలయం వద్ద నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి నెలా రెండు విడతలుగా గ్రామానికి వస్తారని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు సీహెచ్ భరత్, ఏఎన్ఎం కె.విజయలక్ష్మి, ఆశలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు లేని దేశాన్ని నిర్మిద్దాం

మలికిపురం: ఆత్మహత్యలు లేని భారతదేశాన్ని నిర్మిద్దామని మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద కాన్వెంట్ ప్రిన్సిపాల్ పీవీవీ ప్రసాద్ అన్నారు. కాన్వెంట్‌లో సోమవారం జరిగిన ఆత్మహత్యల నివారణ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. గుంటూరు ఈద స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మహత్యలు చేసుకున్న వారికి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. అలాగే మలికిపురం ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ తోరం సతీష్, ముప్పర్తి సత్యనారాయణ, ఆనంద్‌మహాలీ, తదితరులు పాల్గొన్నారు. సమస్యలకు కుంగిపోయి విలువైన జీవితాలను పోగొట్టుకోవడం అవివేకమని కరస్పాండెంట్ అన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ కూడా నిర్వహించారు.

గోశాలకు దాణా వితరణ

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలోని గోశాలలోని గోవులకు పలువురు దాతలు, స్వామి సేవా బృందం సభ్యులు ముక్కోటి ఏకాదశి పర్వదినాన దాణా వితరణ చేశారు. సేవా బృందం సభ్యులు బెల్లంకొండ సూరిబాబు, జక్కంపూడి మాణిక్యాలరావు, బెల్లంకొండ రాంబాబు, వంకాయల సర్వేశ్వరరావు, రావి వాసు, రావి ప్రసాద్ కలిపి దాణా మిక్చర్ 75 కేజీలు ఇచ్చారు. మోరికి చెందిన ముత్యాల గోపి దాణా మిక్చర్ 25 కేజీలు, పాలగుమ్మికి చెందిన అప్పారి సత్యనారాయణ చిట్టు 40 కేజీలు, నర్సాపురానికి చెందిన ఎస్.సూర్య కళావతి చిట్టు 40 కేజీలు గోశాలకు అందజేశారు. బళ్ల ఏడు కొండలు, రావి బాబూరావు, గునిశెట్టి శివ, గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

మిమిక్రీ ఆర్టిస్ట్‌కు ప్రతిభా పురస్కారం

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరానికి చెందిన మిమిక్రీ ఆర్టిస్ట్ డాక్టర్ కొల్లాబత్తుల జాషువాకు సోమవారం విజయవాడలో భవిరి ఆర్ట్స్ ఆధ్వర్యాన ప్రతిభా పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. పద్మశ్రీ, డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ పుట్టినరోజున ప్రపంచ మిమిక్రీ దినోత్సవం సందర్భంగా పై ప్రతిభా పురస్కారాన్ని జాషువా అందుకున్నారు. మిమిక్రీ విభాగంలో 60 సంవత్సరాలుగా సేవలందిస్తున్నందుకు ఈ పురస్కారంకు అర్హత సాధించారు. విజయవాడ ఘంటశాల వెంకటేశ్వరరావు మ్యూజికల్ కాలేజీ నందు సంస్థ ప్రధానకార్యదర్శి భవిరి రవి, అధ్యక్షుడు జీవీఎన్ రాజు ఆయనకు ఇచ్చారు. కాగా పురస్కారాని అందుకున్న జాషువాకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, మలికిపురం గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

కరాటేలో నాగచందు ప్రతిభ



రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో చింతలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మాదాసి నాగచందు ప్రతిభ చూపాడు. ఈ మేరకు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన నాగచందును సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

వర్మీ కంపోస్టు కేంద్రం ప్రారంభం



మామిడికుదురులో వర్మీ కంపోస్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వనజకుమారి

మామిడికుదురు: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వర్మీ కంపోస్టు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఎంపీపీ కుసుమ వనజకుమారి ప్రారంభించారు. సీఈఓ ఎస్వీవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు వర్మీ కంపోస్టు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వర్మీ కంపోస్టు రైతులకు అతి తక్కువ ధరకు ఇక్కడ విక్రయిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.శివరామకృష్ణయ్య, సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, కొనుకు ప్రేమజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు పీవీఎస్‌వీ ప్రసాద్, పీవీఆర్‌కే రాజు, బి.కోటయ్య, కె.వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.